



• రోడ్డుపై కంకర వేసిన దృశ్యం


- బోధన్, భైంసా మధ్య కొనసాగుతున్న జాతీయ రహదారి నిర్మాణం
- ఇప్పటికే 30 కిలోమీటర్ల మేర పనులను పూర్తిచేసిన అధికారులు
- ఈ రోడ్డు ద్వారా మద్నూర్, ఎన్‌హెచ్ 63 అనుసంధానం
- వచ్చే ఏడాదిలోపు పూర్తి చేసేందుకు అధికారుల కసరత్తు
- రుద్రూర్, మద్నూర్ రోడ్డుకు ప్రతిపాదనలు పంపించిన హైవే అథారిటీ అధికారులు

వేగంగా రోడ్డు విస్తరణ పనులు



• మట్టితో రోడ్డును చదును చేస్తున్న దృశ్యం





• యంచ వద్ద కొనసాగుతున్న బ్రిడ్జి పనులు

నిజామాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని బోధన్, బాసర మీదుగా నిర్మల్ జిల్లా భైంసా వరకు చేపట్టిన 161 బీబీ జాతీయ రహదారి విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. కొత్త రహదారుల నిర్మాణానికి ఒకవైపు ప్రతిపాదనలు సిద్ధం చేస్తుండగా.. ఇప్పటికే మంజూరైన నాలుగు లైన్‌ల జాతీయ రహదారి నిర్మాణం కొనసాగుతోంది. గోదావరిపై కొత్త బ్రిడ్జిల నిర్మాణం కొనసాగుతూనే రుద్రూర్, బోధన్, బాసర, భైంసా వరకు ఈ రోడ్డు నిర్మాణం జరుగుతోంది. మొత్తం నాలుగు లైన్‌ల రోడ్డు కోసం భూసేకరణ పూర్తి చేసిన అధికారులు ఇప్పటికే సగం నిర్మాణాన్ని పూర్తి చేశారు. మిగతా నిర్మాణాన్ని షెడ్యూల్ ప్రకారం పూర్తి చేసే విధంగా పనులను కొనసాగిస్తున్నారు. రుద్రూర్, మద్నూర్ నాలుగు లైన్‌ల రోడ్డు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. వచ్చే సంవత్సరంలోపు బోధన్, భైంసా రహదారి నిర్మాణం అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు.

గత ఏడాది మంజూరు..

జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణం కొనసాగుతోంది. ఇప్పటికే హైదరాబాద్, న్యూఢిల్లీ నేషనల్ హైవే ఉండగా కొత్తగా బోధన్, బాసర, భైంసా నాలుగు లైన్‌ల 161బీబీ జాతీయ రహదారి నిర్మాణం కొనసాగుతోంది. గత సంవత్సరం మంజూరు కావడంతో పాటు టెండర్ ప్రక్రియ పూర్తికాగా ప్రస్తుతం రోడ్డు నిర్మాణం కొనసాగుతోంది. ఈ జాతీయ రహదారి 56.6 కిలోమీటర్లు ఉండగా పూర్తిస్థాయిలో నిర్మాణాన్ని కొనసాగిస్తున్నారు. మద్నూర్ మీదుగా వెళ్లే జాతీయ రహదారికి అనుసంధానం చేసే విధంగా ఈ రోడ్డు నిర్మాణం చేస్తున్నారు. మహారాష్ట్ర నుంచి తెలంగాణలోని ఇతర జిల్లాలకు వెళ్లే విధంగా ఈరోడ్డు నిర్మాణం చేస్తున్నారు. నేషనల్ హైవే 63కి అనుసంధానం చేయడంతో పాటు ఇతర జిల్లాలకు నేరుగా వెళ్లేందుకు ఈ జాతీయ రహదారి ఉపయోగపడనుండటంతో నిర్మాణాన్ని చేపట్టారు. ఈ రోడ్డు కోసం 380 కోట్ల రూపాయలను వెచ్చిస్తున్నారు. 56.6 కిలోమీటర్ల రోడ్డు కోసం 200 ఎకరాలకు పైగా అవసరమైన భూసేకరణ పూర్తి చేశారు. పనులను వేగంగా కొనసాగిస్తున్నారు. మట్టి రోడ్డు వేయడంతో పాటు బీటీని కూడా పూర్తి చేస్తున్నారు. గత సంవత్సరం నిర్మాణం మొదలు పెట్టిన నేషనల్ హైవే అథారిటీ అధికారులు ఇప్పటి వరకు 30కిలో మీటర్ల రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశారు. బోధన్, భైంసా మార్గంలో ఉన్న గోదావరి నదిపై కొత్తగా మరో బ్రిడ్జి నిర్మాణాన్ని చేపడుతున్నారు. నాలుగు లైన్‌ల రోడ్లకు అవసరమైన విధంగా బ్రిడ్జిలు ఉండే విధంగా ఈ నిర్మాణాలను చేస్తున్నారు. వచ్చే సంవత్సరంలోపు ఈ రోడ్డు నిర్మాణంతో పాటు బ్రిడ్జిలను పూర్తి చేసే విధంగా పనులను కొనసాగిస్తున్నారు. రోడ్డుకు అవసరమైన మట్టి, ఇసుక, కంకరకు సంబంధించిన అనుమతులను తీసుకోవడంతో పాటు పనులను వేగంగా కొనసాగిస్తున్నారు.

ఛత్తీస్‌గఢ్‌కు అనుసంధానం

ఈ రోడ్డు పూర్తయితే మద్నూర్ నుంచి నేషనల్ హైవే మీదుగా వెళ్లే వాహనాలు ఈ వైపు మళ్లించడంతో పాటు బోధన్ నుంచి భైంసా మీదుగా మంచిర్యాల, చెన్నూరు, సిరోంచ మీదుగా ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లే విధంగా ఈ రోడ్డును అనుసంధానం చేస్తున్నారు. మహారాష్ట్రలోని ఇతర జిల్లాలకు, ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లేందుకు ఈ రోడ్డు అనుకూలించడంతో పాటు దూరం కూడా తగ్గే అవకాశం ఉందని పనులను కొనసాగిస్తున్నారు. జిల్లాలో ఈ జాతీయ రహదారి నిర్మాణం చేపట్టడంతో పాటు మరొక రోడ్డు కోసం కూడా ప్రతిపాదనలను పంపించారు. రుద్రూర్, కోటగిరి మీదుగా మద్నూర్ వరకు నాలుగు లైన్‌ల రోడ్డు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ రోడ్డు కోసం సుమారు రూ.650 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. ఈ రోడ్డుకు కేంద్రం నుంచి అనుమతి రాగానే టెండర్లు పిలవడంతో పాటు పనులు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. మొదట డబుల్ రోడ్డు కోసం ప్రతిపాదనలు పంపించడంతో నాలుగు లైన్‌ల రోడ్డుగా నిర్మాణం చేయాలని కేంద్రం కోరడంతో మళ్లీ ప్రతిపాదనలు పంపించారు. బోధన్, భైంసా నాలుగు లైన్‌ల రోడ్డు నిర్మాణం పనులను వచ్చే సంవత్సరంలోపు నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేస్తామని నేషనల్ హైవే అథారిటీ అధికారి తెలిపారు. ఈ రోడ్డు పనులు పూర్తి చేయడంతో పాటు కొత్తగా చేపట్టే రోడ్ల కోసం భూసేకరణ ప్రక్రియ కూడా రాష్ట్ర అధికారులతో కలిసి చేపడుతున్నట్లు వారు తెలిపారు.



రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్ఎం

లోకో పైలట్‌లకు మెరుగైన వసతులు కల్పిస్తున్నాం

• రైల్వే శాఖ సీనియర్ డీఆర్ఎం జీషాన్ అహ్మద్

ఖిల్లా, జూలై 11: రైల్వే శాఖ తమ సిబ్బంది వసతుల కల్పనకు అనేక మార్పులు చేసిందని, ముఖ్యంగా లోకో పైలట్‌ల కోసం మెరుగైన వసతులు కల్పించే ధ్యేయంతోనే శాఖ పని చేస్తుందని రైల్వే శాఖ హైదరాబాద్ డివిజన్ సీనియర్ డీఆర్ఎం జీషాన్ అహ్మద్ అన్నారు. సిబ్బందికి అందుతున్న వసతులపై గురువారం డీఆర్ఎం లోకేష్ విష్ణోయ్, టెక్నికల్ సిబ్బందితో కలిసి ప్రత్యేక రైలులో నిజామాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. అనంతరం రన్నింగ్ రూమ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. లోకో పైలట్‌ల కోసం మెరుగైన వసతులు కల్పిస్తున్నామన్నారు. వారికి తక్కువ ధరలకే నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నామన్నారు. ఆహ్లాదకరమైన విశ్రాంతి గదులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రూ.80లకు లభించే భోజనాన్ని కేవలం రూ.8లకే అందిస్తున్నామన్నారు. మహిళా లోకోపైలట్‌ల కోసం ప్రత్యేకంగా విశ్రాంతి గదులతో పాటు వారికి కావాలసిన అన్ని వసతులను ఏర్పాటు చేశామన్నారు. యోగా చేసుకోవడానికి ప్ర త్యేకంగా ధ్యానమందిరాన్ని సైతం ఏర్పాటు చేశామన్నారు. విధుల్లో ఉన్న సమయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా వారిని ఎప్పటికప్పుడు సీసీ కెమెరాల ద్వారా పరిశీలించడం జరుగుతుందన్నారు. అంత కు ముందు నిజామాబాద్ రైల్వే స్టేషన్ మేనేజర్ సదాశివుడుకుర్మా, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారెడ్డి తదితరులు వారికి స్వాగతం పలికారు.





విదేశీ విద్యా పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, జూలై 11: 2024-25 విద్యాసంవత్సరానికి స్ప్రింగ్ సీజన్‌కు రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించే క్రైస్తవ మైనార్టీ విద్యార్థులకు ముఖ్యమంత్రి విదేశీ విద్యా పథకం (సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం) కింద దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారిని కె.కృష్ణవేణి తెలిపారు. యుఎస్‌ఏ, యుకే, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, దక్షిణ కొరియా, జపాన్, ఫ్రాన్స్, న్యూజిలాండ్‌లలో విదేశి విశ్వవిద్యాలయాల్లో తెలంగాణకు చెందిన క్రైస్తవ మైనార్టీలు పీజీ, పీహెచ్‌డీ కోర్సులు చదివేందుకు అవకాశం కల్పిస్తున్నామని ఆమె తెలిపారు. డిగ్రీలో 60 శాతం మార్కులు ఉండి పోస్టు గ్రాడ్యుయేషన్ చేసేందుకు మరియు పీజీలో 60 శాతం మార్కులు వచ్చి పీహెచ్‌డీ చేయాలనుకునే వారు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని ఆమె తెలిపారు. 2024 జనవరి 1 నుంచి 2024 జూలై 31 వరకు ఎంపిక చేయబడిన విదేశీ యూనివర్సిటీలలో అడ్మిషన్ పొందిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హతలు ఉన్న విద్యార్థులు సంబంధిత ధ్రువపత్రాలతో ఆన్‌లైన్ ద్వారా ఆగస్టు 7లోగా దరఖాస్తు చేసుకొని 27లోగా జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. దరఖాస్తులను తెలంగాణఈపాస్.సిజి జి.జివోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఇతర వివరాలకు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయం, నూతన కలెక్టరేట్, 9700351786, 9493115986 నెంబర్లను సంప్రదించాలన్నారు.



జిల్లాలో పోస్టింగులకు పైరవీల జోరు!

- అనుకూల ప్రాంతాలకు వెళ్లేందుకు పైరవీలను కొనసాగిస్తున్న ఉద్యోగులు, అధికారులు
- అధికార పార్టీ నేతల ద్వారా ప్రయత్నాలు
- ఇప్పటికే పలు శాఖల్లో ఉద్యోగుల సీనియారిటీ జాబితా ప్రకటన

నిజామాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉద్యోగుల సాధారణ బదిలీలలో పైరవీల జోరు పెరుగుతోంది. అధికారులు సీనియారిటీ లిస్ట్‌లను తయారు చేయగా ఉద్యోగులు మాత్రం తమ ప్రయత్నాలను మానలేదు. కొంత మంది ఉద్యోగులు, అధికారులు ఎక్కడ వేసిన వెళ్లేందుకు సిద్ధమవుతుండగా మరికొంత మంది జిల్లాలో ఉండేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వివిధ కారణాలను చెప్పి జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో పనిచేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. అధికార పార్టీ నేతల వల్ల క్యూలు కట్టడంతో పాటు సిఫారసు లేఖలను ఉన్నతాధికారులకు ఇచ్చే విధంగా ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. కొంత మంది ఉద్యోగులు, అధికారులు అక్కడి నుంచే ఫోన్‌లు చేయించుకుంటూ నచ్చిన ప్రాంతాల్లో పోస్టింగ్ వచ్చే విధంగా ఈ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. నాలుగేళ్లు ఒకేచోట పనిచేసిన వారికి బదిలీ తప్పనిసరి కావడంతో అధికారులు మాత్రం ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సీనియారిటీ లిస్ట్‌ను తయారు చేయడంతో పాటు ఉన్నతాధికారులకు పంపిస్తున్నారు. కార్యాలయాల్లో కూడా ఆ జాబితాను ప్రకటిస్తున్నారు. ఉద్యోగుల ఆప్షన్ తీసుకొని బదిలీ చేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

బదిలీలకు ఉత్తర్వులు జారీ

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలకు ఉత్తర్వులను జారీ చేసింది. తప్పనిసరిగా ఒకేచోట పనిచేస్తూ నాలుగేళ్లు పూర్తయిన వారినందరిని బదిలీ చేయాలని ఆ ఉత్తర్వులో ఆదేశాలు ఇచ్చింది. ఆయా శాఖల్లోని క్యాడర్ స్ట్రెంత్‌కు అనుగుణంగా ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగుల్లో 40 శాతం మందిని తప్పనిసరిగా బదిలీ చేయాలని కోరింది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అన్ని శాఖల పరిధిలో ఉద్యోగుల బదిలీల జాబితాను సిద్ధం చేశారు. ఆయా శాఖల విభాగాల్లో నోటీస్‌పైన ఉంచుతున్నారు. ఆ జాబితా అనుగుణంగా ఉద్యోగులు, అధికారులు వెబ్ ఆప్షన్ ద్వారా బదిలీకి అవకాశాలను ఇస్తున్నారు. జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో జిల్లా క్యాడర్ వారిని ఇక్కడే మండలాల పరిధిలో బదిలీ చేస్తారు. జోనల్ పరిధిలోని వారిని నాలుగు జిల్లాలైన నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్, ఆదిలాబాద్ పరిధిలో బదిలీ చేయనున్నారు. మల్టీజోన్ పరిధిలో వారిని రాష్ట్ర క్యాడర్ కావడం వల్ల ఆ స్థాయిలోనే ఇతర జిల్లాలకు బదిలీ చేయనున్నారు. జిల్లాలో పనిచేస్తున్న వారిలో అటెండర్ నుంచి జిల్లా అధికారుల వరకు ఇక్కడే పనిచేస్తున్న వారు ఎక్కువ మందే ఉన్నారు. వీరిలో జిల్లా వారే కాకుండా ఇతర జిల్లాల వారు ఉన్నారు. కొంత మంది ఎన్నికల సమయంలో బదిలీలను తప్పించుకునేందుకు ఇతర శాఖల్లోకి డిప్యూటేషన్ వెళ్లారు. మరికొంత మంది ఇతర జిల్లాలకు బదిలీ అయ్యారు. కొంత మంది ఎన్నికలకు సంబంధం లేని శాఖల్లో పనిచేస్తున్న వారు దీర్ఘకాలికంగా ఇక్కడే కొనసాగుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వీరంతా ఇప్పుడు బదిలీ కానున్నారు. జిల్లాలో ఆయా శాఖల్లో జాబ్ కొనసాగిస్తూ ఇక్కడే పనిచేస్తున్న వారు ఎక్కువ మంది ఉన్నారు. వారంతా ప్రస్తుతం బదిలీ కానున్నారు.

40 శాతం మంది ఉద్యోగుల బదిలీకి అవకాశం

రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడటం.. ఆరేళ్ల తర్వాత బదిలీ ఉత్తర్వులు ఇవ్వడం, 40 శాతం మందిని బదిలీ చేయాలని ఉత్తర్వులో పేర్కొనడంతో ఎక్కువ మంది ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. పదేళ్ల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వంలో పనిచేసి ముద్ర పడ్డ అధికారులు కూడా ఈ దఫా బదిలీ ఉత్తర్వులను ఉపయోగించుకొని అధికార పార్టీ నేతల చుట్టూ తిరుగుతున్నారు. తమకు అవకాశం ఇస్తే వారికి సహకరించిన విధంగానే పనిచేస్తామని హామీలిస్తున్నారు. జిల్లాతో పాటు ఇతర జిల్లాలోని నేతలను కలుస్తూ అవకాశాలు ఇవ్వాలని కోరుతున్నారు. ఉద్యోగ సంఘాల నేతల ద్వారా కూడా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. సీనియారిటీ లిస్ట్ కొన్ని శాఖల్లో తయారు కావడం మరికొన్ని శాఖల్లో చివరి దశకు చేరుకోవడంతో అన్ని అవకాశాలను తమకు అనుకూలంగా మలుచుకొని ఈ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు.

ప్రధాన శాఖల ఉద్యోగులు జోరుగా ప్రయత్నాలు

జిల్లాలోని ప్రధాన శాఖలైన మున్సిపల్, రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్ శాఖల్లో పనిచేస్తున్న వారు ఎక్కువగా ప్రయత్నాలను చేస్తున్నారు. ప్రధానమైన ఇంజనీరింగ్ శాఖలైన మున్సిపల్, పబ్లిక్ హెల్త్, టౌన్‌ప్లానింగ్, పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బి, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యుఎస్‌లో పనిచేస్తున్న ఏఈలు, డీఈలు కూడా జిల్లా పరిధిలోనే కొనసాగేందుకు ఎక్కువగా ప్రయత్నాలు చేస్తున్నారు. మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న వారు ఏళ్లతరబడి ఇక్కడే కొనసాగుతున్నారు. టౌన్‌ప్లానింగ్, శానిటేషన్, ఇంజనీరింగ్ విభాగాల్లో చేరిన వారు కూడా పదోన్నతులు వచ్చిన కదలడం లేదు. మున్సిపల్ నేతలతో పాటు ప్రధాన పార్టీ నేతల ద్వారా బదిలీలను అనుకూలంగా మలుచుకునేందుకు ఈ పైరవీలను కొనసాగిస్తున్నారు. ఈనెల 19, 20 తేదీల్లో వెబ్ ఆప్షన్ ద్వారా బదిలీ ఉత్తర్వులు వెలువడనుండటంతో ఆలోపే తమకు అనుకూల ప్రాంతాలకు సిఫారసులు చేసుకునే విధంగా ఈ పైరవీలను కొనసాగిస్తున్నారు. విద్యాశాఖలో పదోన్నతులు, బదిలీలు వివాదాస్పదం కావడం, బదిలీ చేసిన రిలీవ్ కాకపోవడం, రిలీవ్ అయిన బదిలీ స్థానంలో ఎంఈవోలు చేర్చుకోకపోవడం వల్ల వివాదాలు ఏర్పడుతున్నాయి. ఆ విధంగా ఇబ్బందులు ఏర్పడకుండా అన్ని శాఖల పరిధిలో వెబ్ ఆప్షన్ల ద్వారా బదిలీ ఉత్తర్వులను వెలువరిచేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న మానాల మోహన్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ

రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మోహన్‌రెడ్డి

నిజామాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్‌గా మానాల మోహన్‌రెడ్డి బాధ్యతలను చేపట్టారు. హైదరాబాద్‌లోని సహకార యూనియన్ కార్యాలయంలో గురువారం అధికారుల నుంచి బాధ్యతలను స్వీకరించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్న ఆయనకు కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లతో పాటు పార్టీకి సంబంధించిన నేతలు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, విప్ ఆదిశ్రీనివాస్, రాష్ట్ర పీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్, రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు తాహెర్‌బిన్ హందాన్, ఈరవత్రి అనిల్, సిరిసిల్ల రాజయ్య, కాసుల బాల్‌రాజు, మారగంగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, జిల్లా సీనియర్ నేతలు గడుగు గంగాధర్, నగేష్‌రెడ్డి, వడ్డెపల్లి సుభాష్‌రెడ్డి, నగర అధ్యక్షులు కేశవేణు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు సునీల్‌రెడ్డి, వినయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెంజల్‌లో సెల్‌ఫోన్ రికవరీ

రెంజల్, జూలై 11: మండలంలోని బోర్గాం గ్రామానికి చెందిన రాము కొన్ని రోజుల క్రితం తన సెల్‌ఫోన్ పోయిందని రెంజల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా దొంగిలించబడిన సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని గురువారం బాధితుడు రాముకు ఎస్‌ఐ సాయన్న అందజేశారు.

అక్రమ నిర్మాణం పరిశీలన

నవీపేట,జూలై11: మండలంలోని స్టేషన్ ఏరియాలోని ఇరిగేషన్ కార్యాలయం స్థలంలో చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని గురువారం ఎంపీవో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి నవ్యశ్రీలు పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు తాము పరిశీలించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇరిగేషన్ కార్యాలయానికి సంబంధించిన ఖాళీ స్థలంలో కట్టిన పరదాలను వెంటనే తొలగించాలని సంబంధిత ఇంటి యాజమానిని ఆదేశించారు. అక్రమ నిర్మాణం చేపట్టడం నేరమన్నారు.

'మాక్లూర్ హైస్కూల్ భవన నిర్మాణాన్ని పూర్తి చేయండి'

మాక్లూర్ , జూలై 11 : మాక్లూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్ పాఠశాల నిర్మాణ పనులు వెంటనే పూర్తిచేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధానకార్యదర్శి జన్నా రఘు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. పాఠశాల, కళాశాలలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, పాఠశాల నిర్మాణపనులు నత్తనడకన సాగుతున్నాయని, వెంటనే నిర్మాణపనులు పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. అనం తరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్య క్రమంలో పీడీఎస్‌యు నాయకులు స్నేహిత్, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

మాజీ ఐపీఎస్ అధికారి సంతకాన్ని
ఫోర్జరీ చేసిన నిందితుల అరెస్టు

నవీపేట, జూలై 11 : మాజీ ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఇద్దరు నిందితులను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ యాదగిరి గౌడ్ తెలిపారు.

మండలంలోని పొతంగల్‌కు చెందిన మగ్గిడి అనిల్‌కు పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికేట్(పీసీసీ) ఇప్పిస్తామని నిజామాబాద్‌కు చెందిన దరిసింగ్ అనే ఏజెంట్‌తో పాటు ఆర్మూర్‌కు చెందిన అతని సహాయకుడు దినాకర్‌లు ఫోర్జరీ పత్రాలను సృష్టించిన విషయం విధితమే. ఈ విషయంపై ఉన్నతాధికారుల ఆదేశం మేరకు నిందితులైన దరిసింగ్, దినాకర్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ ఈ సందర్భంగా తెలిపారు.

'రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి'

కామారెడ్డి టౌన్, జూలై 11:రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలుచేయకుండా కమిటీల పేరుతో కాలయాపన చేస్తుందని బీజేపీ కిసాన్‌మోర్చా నాయకులు అన్నారు. గురువారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి ఏవో అహ్మద్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీప్‌సీజన్ ప్రారంభమై నెలరోజుల పైబడినా రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా పేరుతో ఇచ్చిన హామీని నెరవేర్చలేకపోవడం దురదృష్టకరమని అన్నారు. మెనిఫేస్టోలో పేర్కొన్న విధంగా కాకుండా సబ్‌కమిటీలు అభిప్రాయాల పేరుతో కాలయాపన చేయడం విడ్డురమని తెలిపారు. ఇక రెండు లక్షల రూపాయల వ్యవసాయ రుణమాఫీ పథకం విషయంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 200 రోజులు గడస్తున్నా ఈ ప్రభుత్వం ఇంకా రైతులను గందరగోళ పరుస్తునే ఉందన్నారు. రుణమాఫీ కాని కారణంగా బ్యాంకుల్లో రైతులు అపరాదుల్లా తలవంచుకోవాల్సి వస్తుందని, కౌలు రైతులకు వ్యవసాయకూలీలకు అందిస్తామని చెప్పిన ఆర్థిక తోడ్పాటు విషయంలో ఈ ప్రభుత్వం ఇంకా నోరు మెదపకపోవడం దుర్మార్గమని తెలిపారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం పంటల బీమా అమలుచేయకుండా రైతులు ఇబ్బందులు పాలుచేసిందని ప్రస్తుత ప్రభుత్వం కూడా అమలుచేస్తామని గొప్పలు చెప్పిన ఇంకా కార్యచరణ చేయడం లేదని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చా నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

నవీపేట, జూలై 11 : మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకు సమీపంలో గురువారం కారు, బైక్ ఢీకొనడంతో మండలంలోని మహంతంకు చెందిన సంగెం రఘుపతి అనే 52 సంవత్సరాల వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ యాదగిరి గౌడ్, స్థానికులు తెలిపిన ప్రకారం మహంతంకు చెందిన రఘుపతి పొలంలో గడ్డిమందు కొనుక్కోవడానికి బైక్‌పై నవీపేట వచ్చాడు. యూనియన్ బ్యాంకులో డబ్బులను డ్రా చేసుకుని రోడ్డుకు అవతలి వైపు ఉన్న పెట్రోల్‌బంక్ వైపు బైక్‌పై వెళ్తుండగా నిజామాబాద్ నుంచి నవీపేట పోలీస్‌స్టేషన్‌లో విధులకు హాజరుకావడానికి ఏఎస్ఐ గఫర్ కారులో వస్తుండగా కారు, బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న రఘుపతి తలకు, కాలుకు తీవ్ర గాయాలు కాగా వెంటనే అతనిని మండల కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందించి, మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని మరో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని ఫిర్యాదు

భీమ్‌గల్ రూరల్, జూలై 11 : భీమ్‌గల్ మున్సిపాలిటీ పరిధిలోని 882 సర్వే నెంబరు గల అసైన్డ్‌భూమిలో లింబాద్రి గుట్ట వద్ద చేపడుతున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని భీమ్‌గల్ కాంగ్రెస్ నాయకుడు మల్లెల లక్ష్మణ్ కోరారు. ప్రభుత్వ నిబంధనలను విరుద్ధంగా ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ ఆర్‌సీసీ మడిగెలను, రేకులషెడ్డుల నిర్మాణాలను వెంటనే నిలుపుదల చేయాలని గురువారం మున్సిపాలిటీ కమిషనర్, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అక్రమ నిర్మాణాలను వెంటనే నిలుపుదల చేయకుండా వుంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నాకు దిగుతామని పేర్కొన్నారు.

వెల్మల్‌లో సీసీ రోడ్డు పనుల ప్రారంభం


సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

నందిపేట, జూలై 11 : మండలంలోని వెల్మల్ గ్రామంలో గురువారం సీసీ రోడ్డుపనులను బీజేపీ నాయకులు ప్రారంభించారు. ఎంపీ నిధులతో గ్రామంలో సీసీరోడ్డు పనులను చేప డుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గంగాధర్, మల్లేష్, రాందాస్, భూమేష్ ప్రవీన్, రవి, మల్లన్న, గంగాధర్ ఉన్నారు.

కాంప్లెక్స్ నిర్మాణం కోసం అద్దెదారులకు నోటీసులు

డిచ్‌పల్లి,జూలై 11: మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద షాపింగ్ కాంపెక్స్ నిర్మాణం చేపట్టనున్న నేపథ్యంలో ప్రస్తుతం కొనసాగుతున్న దుకాణదారులకు షాపులు ఖాళీ చేయాలని నోటీసులు అందజేసినట్లు కంట్రోలర్ చందర్‌నాయక్ తెలిపారు. త్వరలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి టెండర్లు పూర్తవుతాయని, అందుకనే ముందస్తుగా ఈ నోటీసులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్సీ

డిచ్‌పల్లి, జూలై 11 : గత నెల 24న రోడ్డుప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఇటీవల మృతిచెందిన గొనుగంటి నాగేశ్వరరావు కుటుంబాన్ని ధర్మారం(బీ)లో మాజీ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వుల్లోల్ల గంగాధర్ గౌడ్ పరామర్శించారు. ఆయన వెంట నాయకులు రావుల బ్రహ్మానందం, నాయుడు అంజనేయులున్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తెడ్డునర్సయ్య

ఆర్మూర్‌టౌన్, జూలై 11 : పట్టణంలోని కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం సిద్దిపేట జిల్లా కోర్టు న్యాయవాది రవికుమార్‌పై జరిగిన దాడికి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తెడ్డునర్సయ్య మాట్లాడుతూ న్యాయవాదుల సంరక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దేవరశెట్టి అరుణ్, న్యాయవాదులు తుమ్మ సుకేష్, తాజోద్దీన్, కృష్ణంరాజు, జగదీష్, శ్రీధర్, అశోక్, రమేష్ పాల్గొన్నారు.

● **బోధన్‌లో..**

బోధన్‌రూరల్, జూలై 11 : భద్రాచలంలో న్యాయవాదికి పోలీసులు చేతులకు సంకేళ్లు వేసి తీసుకెళ్లడం సరికాదని బోధన్‌బార్ అసోసియేషన్ అధ్యక్షులు పోశెట్టి అన్నారు. గురువారం బోధన్ కోర్టులో భద్రాచలం న్యాయవాదికి సంకేళ్లు వేసి పోలీసులు కోర్టుకు తీసుకెళ్లినందుకు నిరసనగా వారి విధులను బహిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిద్దిపేటలో న్యాయవాదిపై జరిగిన ఘటన మరువకముందే న్యాయవాదులపై ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం శోచనీయమన్నారు. న్యాయవాదుల భద్రత చట్టం తేవాలని కోరారు. న్యాయవాదులపై దాడులు సైతం జరుగుతున్నాయని వీటిపై చట్టం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు కోటేశ్వర్ రావు, సంగం, వాహెద్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

యూఎస్ఎఫ్ఐ డివిజన్ నూతన కమిటీ నియామకం



సమావేశంలో మాట్లాడుతున్న యుఎస్ఎఫ్ఐ జిల్లాకార్యదర్శి

ఆర్మూర్‌టౌన్ , జూలై 11 : పట్టణంలోని సీవీఆర్ జూనియర్ కళాశాలలో గురువారం యూఎస్ఎఫ్ఐ డివిజన్ నూతన కమిటీని నియమించారు. ఈ సందర్భంగా యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పెద్దిసూరి మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై నిరంతరం ప్రభుత్వంతో పోరాటం చేస్తామన్నారు. ఇంటర్ కళాశాలలో మధ్యాహ్నభోజన పథకం అమలు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడ పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందలేదని, తక్షణమే ప్రభుత్వం అందేలా చూడాలని డిమాండ్ చేశారు. డివిజన్ అధ్యక్షునిగా సిద్దాలనాగరాజు, కార్యదర్శిగా ఎం.జవహార్‌సింగ్, ఉపాధ్యక్షునిగా అభిషేక్, అర్వింద్, సహాయ కార్యదర్శులుగా విగ్నేష్‌నాయక్, సుశీల్‌లను నియమించి వారిని అభినందించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో రెండు రోజుల జైలు

బోధన్‌రూరల్, జూలై 11 : మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి బోధన్ కోర్టులో రెండురోజుల పాటు జైలుశిక్షను విధిస్తూ బోధన్‌కోర్టు స్పెషల్ మేజిస్ట్రేట్ శేషతల సాయి తీర్పులో వెల్లడించారు. గురువారం ఉదయం బోధన్ కోర్టులో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో షేక్‌ఫారూఖ్ అనే వ్యక్తి మద్యం సేవించి వాహనాన్ని నడిపినందుకు రెండురోజుల జైలుశిక్ష విధించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

పేకాట స్థావరంపై దాడి.. రూ. 70 వేల నగదు స్వాధీనం

కోటగిరి, జూలై 11 : పోతంగల్ మండలంలోని జల్లాపల్లి గ్రామంలో బుధవారం రాత్రి పేకాట స్థావరంపై దాడిచేసినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. 9 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 70,350 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. 9మంది పేకాట రాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఉమ్మడి మండలంలో ఎక్కడైనా పేకాట నిర్వహిస్తే తమకు సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ పేర్కొన్నారు.

మానవాళి మనుగడకు మొక్కలు నాటాలి

● నాటిన మొక్కలను సంరక్షించాలి ● ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ● పలు సమస్యలపై వినతులు


పిప్రిలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, జూలై 11 : భవిష్యత్‌లో ఇబ్బందులు రాకుండా మానవాళి మనుగడకు ప్రతీఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. గురువారం ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా అధికారులు నాయకులతో కలిసి ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి మొక్కలు నాటారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినప్పుడు పథకాలు పేర్లు మారుతున్నాయి, మొక్కలు నాటుతున్నప్పటికీ అవి బతకడం లేదని దీంతో ఫలితాలు రావడం లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాయిరాం, ఏపీవో ఉమ్మెడ సురేష్, బీజేపీ మండల అధ్యక్షుడు రోహిత్‌రెడ్డి, మాజీఎంపీటీసీ కేసీ.ముత్తెన్న, అధికా రులు, బీజేపీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి..

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డొంకేశ్వర్, నందిపేట మండలాల వీఆర్ఏలు గురువారం ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. 61ఏళ్ళు పైబడి వీఆర్ఏ వారసులను రెగ్యులర్ చేయాలని వారు కోరారు. వీఆర్ఏ వారసులు అర్హత కలిగిన వారు రాష్ట్ర వ్యాప్తంగా 3797మంది ఉన్నారని, వారిని ఇప్పటి వరకు రెగ్యులర్ చేయలేదన్నారు. వీఆర్ఏ వారసులకు ఉత్తర్వులు ఇచ్చే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళాలని, అసెంబ్లీలో తమ సమస్యలపై చర్చించి న్యాయం చేయాలన్నారు.

వికలాంగుల భవన నిర్మాణానికి స్థలం కేటాయించండి..

నందిపేట మండల వికలాంగుల అసోసియేషన్ సభ్యులు గురువారం ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిని కలిసి వికలాంగుల భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల పింఛన్ పెంపుదల, ఇతర పథకాలలో రిజర్వేషన్‌లను అమలు చేసే విధంగా కృషి చేయాలని వారు కోరారు.

వన మహోత్సవ లక్ష్యాన్ని పూర్తిచేయాలి

● అడిషనల్ కలెక్టర్ అంకిత్

డిచ్‌పల్లి, జూలై 11: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేప డుతున్న వనమహోత్సవానికి సంబంధించి పనులు వెంటనే ప్రారంభించాలని, లక్ష్యానికి మించి మొక్కలు నాటాలని అదనపు కలెక్టర్ అంకిత్ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని సుద్దులం, కోరట్‌పల్లి, మెంట్రాజ్‌పల్లి గ్రామాల్లో ఆయన పరిశీలించారు. నాటుతున్న మొక్కలు ఎండ తీవ్రతకు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఇంటింటా మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు విద్యార్థులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనులను రైతు, వేదికను, కంపోస్ట్ షెడ్డు, అవెన్యూ ప్లాంటెషన్‌ను ఆయన పరిశీలించి ఎంపీడీవో రవీందర్, ఎంపీవో శ్రీనివాస్ గౌడ్‌లకు పలు సూచనలు చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా తీసుకుంటున్న దరఖాస్తులను పరిశీలించారు. ఐకేపీ కార్యాలయం తనిఖీ చేసి విద్యార్థులకు అందిస్తున్న యూనిఫాం వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా రక్షిత నీటిట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తూ గ్రామాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో రవీందర్, ఎంపీవో శ్రీనివాస్ గౌడ్, ఏపీవో సుధాకర్‌రెడ్డి, కార్యదర్శులున్నారు.


సుద్దులంలో ఉపాధి హామీ మొక్కలు పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

మానాలను కలిసిన కాంగ్రెస్ నాయకులు


శుభాకాంక్షలు తెలుపుతున్న ఏర్గట్ల కాంగ్రెస్ నాయకులు

ఏర్గట్ల, జులై 11 : మండలంలోని కాంగ్రెస్ నాయకులు గురువారం తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రస్థాయిలో కార్పొరేషన్ పదవిని చేపట్టినందుకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సోమదేవారెడ్డి, మాజీ జడ్పీటీసీ గుల్లె రాజేశ్వర్, తుపాకుల శ్రీనివాస్ గౌడ్, సున్నపు అంజయ్య, గడ్డం జీవన్, రొక్కిడ సంజీవ్, రేండ్ల రమేష్, గణేష్‌లు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : మండల కాంగ్రెస్ నాయకులు గురువారం హైదరాబాద్ తరలివెళ్లారు. ప్రమాణస్వీకారం అనంతరం పదవీబాధ్యతలు చేపట్టిన మానాల మోహన్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కమ్మర్‌పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకెట రవి, బుచ్చిమల్లయ్య, ప్రదీప్, శేఖర్, గణేష్ గౌడ్, నల్ల గణేష్ గుప్త, ప్రసాద్, సుంకరి రాజేశ్వర్, జగదీష్, నర్సాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మానాల మోహన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

బోధన్‌రూరల్ : తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మానాల మోహన్ రెడ్డిని బోధన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా బోధన్ సహకార సంఘాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్లె రమేష్, మందర్నా రవి, ఖాజాపూర్ అశోక్, వై.నరేందర్ రెడ్డి నాయకులు తదితరులున్నారు.

వేల్పూర్:హైదరాబాద్‌లో పదవీ బాధ్యతలు చేపట్టిన మానాల మోహన్‌రెడ్డిని, అలాగే రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఈరవత్రి అనిల్‌ను వేల్పూర్ మండల కాంగ్రెస్ నాయకులు పూలబోకే, శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నందిపేట : మండల కాంగ్రెస్ నాయకులు ఆయనకు పుష్ప గుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్, పీసీసీ ప్రధానకార్యదర్శి వైఎస్. గంగాధర్, ఆర్మూర్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బైండ్ల ప్రశాంత్, నాయకులు తెడ్డుగారి నిఖిల్, దేవిదాస్‌గౌడ్, సిరాజ్ నాగరాజు తదితరులున్నారు.

డొంకేశ్వర్ : మండల కాంగ్రెస్ నాయకులు ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వినయ్‌కుమార్‌రెడ్డితో మర్యాదపూర్వకంగా కలిశారు. బాధ్యతలు చేపట్టిన మానాల మోహన్‌రెడ్డిని శాలువాతో సన్మానించి పూలబోకెను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. చైర్మన్‌ను కలిసిన వారిలో మండల అధ్యక్షుడు భూమేష్‌రెడ్డి, మారంపల్లి లిఫ్ట్ చైర్మన్ భోజారెడ్డి, శ్యామ్‌గౌడ్, తదితరులున్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

బోధన్ రూరల్, జూలై 11 : విద్యుత్తు షాక్‌తో రైతు మృతిచెందాడు. మండలంలోని సాలంపాడ్ క్యాంప్ గ్రామానికి చెందిన మారం రాంబాబు (36) అనే రైతు గురువారం తెల్లవారుజామున పొలంలో నీరు పారించడానికి వెళ్లి విద్యుత్‌షాక్‌తో మృతిచెందినట్లు బోధన్ రూరల్ ఎస్ఐ నాగనాథ్ తెలిపారు. మారం రాంబాబు గురువారం తెల్లవారుజాము న 4గంటల ప్రాంతంలో పొలానికి నీరు పారించడానికి వెళ్లాడని, బోరువేసే సమయంలో విద్యుత్ షాక్‌తో మృతిచెందినట్లు ఆయన తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ జిల్లా ఆసుపత్రికి తరలించామన్నారు. అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు. మృతుడికి భార్య, పిల్లలున్నారని పేర్కొన్నారు.


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

భూ వివాదం పరిష్కరించాలని ఆందోళన

ముప్కాల్, జూలై 11 : బాల్కొండ మండల కేంద్రంలోని 1403 సర్వేలో తలెత్తిన భూవివాదం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం కులసంఘాలు బాల్కొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశాయి. స్థానిక పెద్దమ్మ ఆలయం వద్ద ఉన్న 1403 సర్వేలోని 16 గుంటలు, 1417సర్వేలో గల 75 గుంటలు పాడిదే లింగన్న గతంలో ముదిరాజ్ కులానికి విక్రయించగా రిజిస్ట్రేషన్ సైతం అయింది. అయితే 1403లోని ఐదుగుంటలు పొరపాటున లింగన్న భార్యపై ఉండడంతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గత ఏడాది డిసెంబర్ 8న పలువురి సమక్షంలో రిజిస్ట్రేషన్ చేసేందుకు లిఖితపూర్వకంగా ఒప్పుకుంది. కాని ఇటీవల అదే భూమిని మరో ఇద్దరు వ్యక్తుల పేరున ఈ ఏడాది జూన్‌లో రిజిస్ట్రేషన్ చేసింది. వాస్తవానికి నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి ఆధారాలు లేకుండా ఆర్మూర్ ఇన్‌చార్జీ సబ్‌రిజిస్ట్రర్‌గా ఉన్న మంద కిరణ్ అక్రమ రిజిస్ట్రేషన్ చేసినట్లు వారు ఆరోపిస్తున్నారు. దీనిపై వెంటనే విచారణ జరిపి రిజిస్ట్రేషన్ రద్దుచేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆర్డీవో వచ్చే వరకు ఆందోళన ఆపేదిలేదని మూడు గంటల పాటు బైఠాయించారు. చివరికి న్యాయం చేస్తామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం తహసీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం అందించారు.


తహసీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హాస్టల్ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు


వేల్పూర్‌లో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వేల్పూర్, జూలై 11 : మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ శరత్‌చంద్ర ఆధ్వర్యంలో విద్యార్థులకు అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అం దజేశారు. అంతకు ముందు డాక్టర్ శరత్‌చంద్ర మాట్లాడుతూ విద్యార్థులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని, వాటి నుంచి కాపాడుకోవడానికి విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత తప్పకుండా పాటించాలన్నారు. ప్రతీరోజు భోజనంకు ముందు చేతులను శుభ్రం కడుక్కోవాలన్నారు. బయట ఎలాంటి తినుబండరాలు తీసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యువో భోజేందర్, ఆరోగ్య కార్యకర్త లత, విద్యార్థులు, తదితరులున్నారు.

ఎడపల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు గురువారం ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, అన్నం తినే ముందు కాళ్ళు, చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిలు, జీవశాస్త్ర ఉపాధ్యాయులు సంజీవ్ కుమార్, ఏఎన్ఎం మాధవీలత, ఆశా కార్యకర్తలు రాజమణి, పద్మ, రిబిక, విద్యార్థులు తదితరులున్నారు.

ఫ్యాక్టరీ గేటు ఎదుట కార్మికుల ఉద్యోగ విరమణ


గేటు ఎదుట ఉద్యోగ విరమణ చేస్తున్న కార్మికులు

బోధన్‌రూరల్,జూలై11 : పట్టణంలోని నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ ప్రధాన గేటు వద్ద గురువారం నలుగురు కార్మికులు ఫ్యాక్టరీ గేటు ఎదుటనే ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకుడు నాగేశ్వర రావు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా ఫ్యాక్టరీలో పని చేసిన కార్మికుల ఉద్యోగ విరమణ కార్యక్రమం ఇలా ఫ్యాక్టరీ గేటు ఎదుట చేసుకోవడం విచారకరమన్నారు. ప్రభుత్వం వెంటనే నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగ విరమణ పొందిన కార్మికులు రఘునాథ్, భూమయ్య, సురాజ్ ప్రసాద్, మొహిన్ బేగ్‌లతో కార్మిక సంఘాల నాయకులు గల్లయ్య, నయీముద్దీన్, లింగం గౌడ్, బషీర్, వికారుద్దీన్, మంగ్యా తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలించిన డీఎల్‌పీవో


నందిపేటలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

నందిపేట, జూలై 11 : మండల కేంద్రంలోని పంచాయతీ పరిధిలో జరుగుతున్న పారిశుధ్య పనులను గురువారం ఆర్మూర్ డీఎల్‌పీవో శివకృష్ణ పరిశీలించారు. వర్షాకాలం సీజన్‌లో ప్రతీరోజు రోడ్లను శుభ్రంగా ఊడ్చి మురికి కాలువలను శుభ్రం చేయాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేసి శుద్ధమైన నీటిని అందజేయాలని, స్పెషల్‌డ్రైవ్ ఏర్పాటు చేసి గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని డీఎల్‌పీవో శివకృష్ణ కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీన్, స్థానిక నాయకులు, పంచాయతీ సిబ్బంది, తదితరులున్నారు.

మోస్రా చెరువులో పడి మహిళ మృతి

మోస్రా, జూలై 11 : మండల కేంద్రానికి చెందిన ముదిగపల్లి బాలవ్వ (60) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందింది. రోజు మాదిరిగానే బుధవారం పశువులు మేపుటకు వెళ్లిన బాలవ్వ బర్రెలు కడుగుతుండగా ప్రమాదవశాత్తు మోస్రా చెరువులో కాలుజారి పడిపోయిందని ఎస్ఐ కృష్ణ కుమార్ తెలిపారు. ఊపిరాడక మృతిచెందిందని, మృతదేహాన్ని గురువారం ఉదయం తీయించి, పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు. ఆమె కుమారుడు సాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఉమ్మడి వర్ని మండల ఎస్ఐ కృష్ణకుమార్ తెలిపారు.

'విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి'

బోధన్‌రూరల్, జూలై 11: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సీఏ మట్టేష్‌రెడ్డి అన్నారు. గురువారం సాలూర మండల కేంద్రంలోని తగ్గెల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన నోట్ పుస్తకాలను, నిత్యవసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలలో చదివి సీఏగా ఉన్నత స్థితిలో ఉన్నానని, ప్రభుత్వ పాఠశాలలో మంచి విద్యాబోధన ఉంటుందన్నారు.

ఈ-పాస్ ద్వారానే ఎరువులు విక్రయించాలి

● జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్


ఏర్గట్లలో తనిఖీ చేస్తున్న జిల్లా అధికారి వాజిద్ హుస్సేన్

ఏర్గట్ల, జులై 11: రైతులకు ఇ-పాస్ మిషన్ ద్వారానే ఎరువులను విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికా వాజిద్ హుస్సేన్ తెలిపారు. గురువారం మండలంలోని ఏర్గట్ల, తాళ్ళరాంపూర్ సహకార సంఘాల్లో ఏర్పాటు చేసిన ఎరువుల విక్రయ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈ పాస్‌లో నమోదు చేసిన వివరాలను, భౌతికంగా ఉన్న బస్తాలను ఆన్‌లైన్‌లో వెరిఫికేషన్ చేశారు. విక్రయించిన ఎరువుల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, లేని యెడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ కాంపాటి మల్లయ్య, మండల వ్యవసాయాధికారి లావణ్య, ఏఈఓలు శ్రీనివాస్, గణేష్‌లు పాల్గొన్నారు.

నవాబ్‌అలీ జంగ్ బహదూర్ జయంతి వేడుకలు

మెండోర, జూలై11: మండలంలోని పోచంపాడ్ ఇరిగేషన్ కార్యాలయం వద్ద ఉద్యోగులు ఇంజనీర్ల దినోత్సవం సందర్భంగా నవాబ్‌అలీ జంగ్ బహదూర్ జయంతి వేడుకలను ఇరిగేషన్ అధికారులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నవాబ్‌అలీ జంగ్ బహదూర్ హైదరాబాద్ రాష్ట్రానికి చీఫ్ ఇంజనీర్‌గా పనిచేసి నిజాంసాగర్‌ప్రాజెక్టు నిర్మాణానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక ఇంజనీర్ చక్రపాణి, ఉపపర్యవేక్షక చీఫ్ ఇంజనీర్ లాల్‌సింగ్, ఉపకార్యనిర్వాహక ఇంజనీర్లు గణేష్, గంగాభూషన్, రఘుపతి, సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్లు, అక్తరుద్దిన్, శ్రీనయన, రవి, మాణిక్యం, మధురి, డివిజన్ సర్కిల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

బుస్సాపూర్ పాఠశాల ఉపాధ్యాయులకు వీడ్కోలు

మెండోర, జూలై 11 : మండలంలో బుస్సాపర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించి పదోన్నతితో బదిలీపైన వెళ్ళిన భూపతి, అరుంధతి, కిరణ్మయి ఉపాధ్యాయులను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం రమేష్ మాట్లాడుతూ ప్రతీ ఉపాధ్యాయునికి ఉద్యోగ జీవితంలో బదిలీ తప్పదని వారు పాఠశాలకు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రెంజర్ల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, యుటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి ఓ.రమేష్, ఉపాధ్యాయులు సాయిరాం, నరహరి, శమంత, నర్మేందర్, రాజేశ్వర్, గంగాధర్, రాజ్యలక్ష్మీ, కవిత, తదితరులు పాల్గొన్నారు.

100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ఆర్మూర్‌టౌన్ , జూలై11: పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో గురువారం విద్యుత్ అధికారులు 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఎస్ఎస్ 279/63 కేవీ ట్రాన్స్ ఫార్మర్ ఉండడంతో లో-వోల్టేజీతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టార్ సీతారాం, లైన్‌మెన్ సంతోష్, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు రూ.4,116 జీవనభృతి కల్పించాలి

ఆర్మూర్‌టౌన్ , జూలై 11 : బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు రూ.4,116ల జీవనభృతి ఇవ్వాలని తెలంగాణ ప్రగతి శీల బీడీవర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ముత్తెన్న ఆయన డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని కుమార్‌నారాయణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రకటించిన ప్రకారం బీడీకార్మికులకు జీవన భృతిపెంచి ఇవ్వాలని అన్నారు. బీడీవర్కర్స్ యూనియన్ జిల్లా నాయకుడు కె.రాజేశ్వర్, జి.అర్వింద్‌లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన ప్రత్యేక అధికారిణి

వేల్పూర్, జూలై 11 : మండలంలోని కొనసాగుతున్న ప్రభుత్వ అభివృద్ధి పనులను గురువారం ప్రత్యేక అధికారిణి కృష్ణవేణి పరిశీలించారు. వేల్పూర్‌లోని పల్లె ప్రకృతి వనంను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించి పనులు త్వరగా పూర్తిచేయాలని సూచించారు. అనంతరం ఇంటింటికి మొక్కలు పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు.



రామడుగు గ్రామంలో కప్పతల్లి ఆడుతున్న యువకులు

వానల కోసం 'కప్పతల్లి' ఆట

సిరికొండ, జూన్ 11: జిల్లాలో వర్షాలు సమృద్ధిగా కురువాలని యువకులు కప్పతల్లి ఆట ఆడారు. వర్షాకాలం ప్రారంభమై నెల పదిహేను రోజులు కావస్తున్నా నేటికీ భారీ వర్షాలు కురువక పోవడంతో గ్రామ దేవతలకు పూజలు చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ దేవతలకు జలాభిషేకాలు చేశారు. గురువారం మండలంలోని రామడుగు గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో యువకులు కప్పతల్లి ఆటను ఆడారు. కట్టెకు కప్పను కట్టి ఇద్దరు యువకులు భుజాన వేసుకుని మోస్తూ ఇంటింటికి తిరిగి వర్షాలు కురిపించాలి అంటూ నినాదాలు చేస్తూ పాటలు పాడారు. దీంతో ఇంటికి వచ్చిన కప్పతల్లికి బిందెలతో నీళ్ల పోశారు. గడ్కోల్ గ్రామంలో సైతం గ్రామ పెద్దలు యువకులు కలిసి కప్ప తల్లి ఆట ఆడారు. గ్రామ దేవతలకు జలాభిషేకాలు చేసి పూజలు చేసి వానలు కురిపించాలని వానదేవుడిని మొక్కుకున్నారు.

జగన్నాథ రథయాత్రను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న రాంనంద్ గౌరవదాస్

పెద్దబజార్, జూలై 11: ఈనెల 12న జగన్నాథ రథయాత్ర జయప్రదం చేయాలని ఇస్కాన్ టెంపుల్ వ్యవస్థాపకులు రాంనంద్ గౌరవదాస్ అన్నారు. గురువారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్నాథ రథయాత్రను కంఠేశ్వర్ నుంచి రైల్వే కమాన్, బస్టాండ్, గాంధీచౌక్, పెద్దబజార్, ఆర్ఆర్ చౌరస్తా, పూలాంగ్ మీదుగా విజయలక్ష్మి గార్డెన్ వరకు యాత్ర కొనసాగుతుందన్నారు. ఇస్కాన్ భక్త భజన ప్రవచనాలతో ప్రసాద వితరణ, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు. జిల్లా ప్రజలు హాజరై స్వామివారిని దర్శించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అశోక్ నితాయిదాస్, ఆదిపురశందాస్, గురుదాస్, రమణగోపేశ్ దాస్, తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడిగా సాయి భసవ



నియామకపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్, జూలై 11: నేషనల్ హ్యూమన్ రైట్స్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడిగా సాయి భసవను నియమించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో గురువారం జరిగిన సర్వసభ్య సమావేశంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు మహిబిత రాయ్ ఆదేశాల మేరకు తెలంగాణ స్టేట్ చైర్మన్ అబ్దుల్ రహీం ఉత్తర్వుల నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సాయి భసవ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని డివిజన్ మండలాల్లో కమిటీలు ఏర్పాటు చేసి నిరంతరం ప్రజల యొక్క సమస్యలు తెలుసుకుంటూ వారికి సేవలు అందిస్తామన్నారు. ప్రజల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తామని అన్నారు. తనపై నమ్మకం ఉంచి అవకాశం ఇచ్చినందుకు అధ్యక్ష, కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ మరో బంపర్ ఆఫర్

సుభాష్‌నగర్, జూలై 11: ఆర్టీసీ బస్సులలో దూర ప్రాంతాల్లో ప్రయాణించే వారికి ఆర్టీసీ మరో బంపర్ ఆఫర్ ప్రయాణించింది. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు అప్ అండ్ డౌన్ టిక్కెట్‌ను ఒకేసారి ముందస్తు రిజర్వేషన్ చేసుకుంటే ప్రయాణంలో 10 శాతం రాయితీ కల్పించనుంది. నెలవారి సీజన్ టిక్కెట్ తీసుకొని 20 రోజుల బస్సు చార్జీలతో 30 రోజుల వరకు ప్రయాణించవచ్చని ఆర్టీసీ రీజియన్ మేనేజర్ జానిరెడ్డి తెలిపారు. నెలవారి సీజన్ టిక్కెట్ తీసుకున్న వారు 20 రూపాయలు అదనంగా చెల్లిస్తే డీలక్స్ బస్సులలో కూడా ప్రయాణం చేయవచ్చని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా బోనాల పండుగ

మోపాల్, జూలై 11: మండలంలోని న్యాల్‌కల్ గ్రామంలో గురువారం సాయంత్రం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో ఉన్న మహాలక్ష్మి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. పాడి పంట ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రతి సంవత్సరం మహాలక్ష్మి అమ్మకు బోనాలతో ఊరేగింపు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకోవడం జరుగుతుందని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ పండుగను తమ తాతల కాలం నుండి నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుందని గ్రామాభివృద్ధి కమిటీ పెద్దలు తెలిపారు. ఈ పండుగ కార్యక్రమంలో కుల మతాలకు అతీతంగా అందరూ పాల్గొని అమ్మవారిని దర్శించుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

● అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నిజామాబాద్ రూరల్, జూలై, 11: నగర పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, విద్యార్థులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని డీఈవో దుర్గాప్రసాద్‌కు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని 13వ డివిజన్‌లోని సారంగపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల ఎ.సులోచన అనే 8వ తరగతి విద్యార్థిని పాఠశాలలో విద్యుదాఘాతంతో అస్వస్థతకు గురయ్యారు. జడ్పీహెచ్ఎస్, ప్రైమరీ పాఠశాలను మొత్తం మాజీ ఎంపీటీసీ హన్మంతు, ఇన్‌చార్జి హెడ్మాస్టర్ లలితతో కలిసి పాఠశాల క్యాంపస్‌ను పరిశీలించారు. మన ఊరు-మనబడి పథకం కింద రూ.36 లక్షల నిధులు మంజూరయ్యాయని, అమ్మ ఆదర్శ పాఠశాల కింద పాఠశాలకు నిదులు మంజూరుకాలేదని హెడ్మాస్టర్ తెలిపారు. గుత్తేదారుకి బిల్లులు రాకపోవడంతో పనులు అర్థాంతరంగా ఆపివేశారని తెలిపారు. విద్యుత్ మరమ్మతులు, ఫ్లోరింగ్ మరమ్మతులు చేపట్టలేదన్నారు. బాలికలకు, మహిళా ఉపాధ్యాయురాళ్లకు సైతం బాత్‌రూంలు లేవని చెప్పడంతో ఎమ్మెల్యే ఆశ్చర్యపోయారు. 230 మంది విద్యార్థులున్న పాఠశాలలో మూత్రశాలలు లేకపోవడం ఏమిటని డీఈవో దుర్గాప్రసాద్‌ను ఫోన్‌లో అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు నైట్ వాచ్‌మెన్, అటెండర్‌ను నియమించాలన్నారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ లలిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థిని పరామర్శించిన ఎమ్మెల్యే..

జిల్లా కేంద్రంలోని సారంగపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఎ.సులోచనను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త పరామర్శించారు. గురువారం మధ్యాహ్నం సారంగపూర్ గ్రామంలోని సులోచన ఇంటికి వెళ్లారు. ఘటన పట్ల విద్యార్థిని అడిగి తెలుసుకున్నారు. ఇంటర్‌వెల్ సమయంలో తన స్నేహితురాలు కోసం వెళ్లానని తలుపు పక్కనే విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయని చెప్పింది. కరెంట్ వైర్లు తన ఎడమ చేతి బొటనవేలికి తగిలి కరెంట్ షాక్ తగిలిందన్నారు. వెంటనే ఆ గదిలో వున్న విద్యార్థులు చీపురు తీసుకుని గట్టిగా కొట్టడంతో వైర్లు చేతినుంచి విడిపోయాయన్నారు. స్కూల్ పక్కనే ఉన్న తమ తల్లిదండ్రులకు తెలిసి వెంటనే తనను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపింది. ధైర్యంగా ఉండాలని, అన్ని విధాలా తాను ఆదుకుంటానని ఎమ్మెల్యే ధన్‌పాల్ ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీటీసీ హన్మంతు, సురేష్ తదితరులున్నారు.



గాయపడిన విద్యార్థిని సులోచనను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

ప్రజా ఆరోగ్యం కోసం జనాభాను నియంత్రించాలి

● డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్

పెద్దబజార్, జూలై 11: ప్రజాఆరోగ్యం కోసం జనాభాను నియంత్రించాలని డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ అన్నారు. గురువారం నగరంలోని దుబ్బ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జిల్లా స్థాయి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'చిన్న కుటుంబం చింతలేని కుటుంబం, కుటుంబ నియంత్రణ పాటిద్దాం పెరుగుతున్న జనాభాను అరికడదాం' అంటూ నినాదాలను చేస్తూ వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి పీసీ పరిధిలో, డివిజన్ల వారీగా అధిక జనాభాపై కుటుంబ సంక్షేమ, కుటుంబ నియంత్రణ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ నెల 24 వరకు సర్వీస్ డెలివరీ నిర్వహిస్తామన్నారు. పురుషులకు శాశ్వత కుటుంబ నియంత్రణ కోసం ఎన్ఎస్‌వి శస్త్ర చికిత్స (వెసెక్టమి) శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 12న ఆర్మూర్ పిహెచ్‌సిలో, 16, 18, 23 తేదీలలో డిచ్‌పల్లి పిహెచ్‌సిలో, 20న మోర్తాడ్ పిహెచ్‌సిలో ఏర్పాటు చేశామన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని మూడు విభాగాల్లో లక్కీ డీప్ తీయడం జరిగిందన్నారు. మొదటగా ఒక సంతానం కలిగి శాశ్వత కుటుంబ నియంత్రణ అవలంభించిన వారు గౌతంనగర్‌లోని పిహెచ్‌సిలో పద్మ, ఐయుసిడి గత ఐదు సంవత్సరాల నుంచి ఉపయోగిస్తున్న వారు, చౌట్‌పల్లి పిహెచ్‌సిలోని అసకొత్తూర్‌కు చెందిన పెద్ది మానస, తాత్కాలిక కుటుంబ నియంత్రణ ఇంజెక్షన్ గత సంవత్సరం నుంచి ఉపయోగిస్తున్న వారికి 1000 రూపాయల చొప్పున పారితోషకం అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేష్, వైద్యులు రవీందర్, రాజు, వెంకటేశ్, సంతోష్, డెమో గంగాధర్, డిఎంఈఈ ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు, సులోచన, నాగరాజు, ఆశకార్యకర్తలు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అటవీశాఖలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ల బదిలీలు

సుభాష్‌నగర్, జూలై 11: అటవీశాఖలో బదిలీల ప్రక్రియ మొదలైంది. మొదటగా డిప్యూటీ రేంజ్ అధికారుల బదిలీ ప్రక్రియ గురువారం చేపట్టారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ల బదిలీల ప్రక్రియను సీసీఎఫ్ శర్వానంద్ ఆధ్వర్యంలో చేపట్టారు. నిజామాబాద్ జిల్లాలో అటవీశాఖ పరిధిలో 40శాతం మార్కులు ఉన్న అధికారులకు బదిలీలకు అవకాశం కల్పించారు. జిల్లాలో 5గురు డిప్యూటీ రేంజ్ అధికారులకు బదిలీలలో అవకాశం ఉండడంతో ఐదుగురు అధికారులకు బదిలీలు చేపట్టారు. జిల్లాలోని ఆర్మూర్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్‌గా కొనసాగుతున్న జిల్లా ఫారెస్టు అధికారుల సంఘం అధ్యక్షుడు సుధాకర్ అదే రేంజ్‌లో కొనసాగుతున్నారు. ఆర్మూర్ టాస్క్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న శ్రీనివాస్ బషీరాబాద్ రేంజ్‌కు బదిలీ అయ్యారు. బాల్కొండ రేంజ్‌లో ప నిచేస్తున్న సౌమ్య జగిత్యాల జిల్లా ధర్మపురి రేంజ్‌కు బదిలీ అయ్యారు. ఆర్మూర్ హెడ్ క్వార్టర్స్‌లో పనిచేస్తున్న మాధవి ఆర్మూర్ టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ అయ్యారు. ధర్పల్లి రేంజ్‌లో పనిచేస్తున్న ఆసీఫుద్దిన్ ను బోథ్‌రేంజ్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. నిర్మల్‌లో పనిచేస్తున్న రణవీర్‌ను బాల్కొండకు బదిలీ చేశారు. నిర్మల్‌లో డిప్యూటీ రేంజ్ అధికారిగా పనిచేస్తున్న శ్రీదేవిని ఆర్మూర్ హెడ్‌క్వార్టర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. గురువారం సెక్షన్ ఆఫీసర్ల బదిలీ ప్రక్రియ ఉండగా కొన్ని టెక్నికల్ కారణాలతో బదిలీ ప్రక్రియ ఆపినట్లు అటవీశాఖ ఉన్నతాధికారులు తెలిపారు.



కిసాన్‌నగర్‌లో ఈత మొక్కలను నాటుతున్న అధికారులు

కిసాన్‌నగర్‌లో వన మహోత్సవం

ముప్కాల్, జూలై 11: బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌లో వన మహోత్సవంలో భాగంగా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గురువారం అధికారులు 500 ఈతమొక్కలను నాటారు. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్, పంచాయతీ ప్రత్యేక అధికారి ఎంపీడీవో బాస్కర్‌రెడ్డి, సబ్‌ఇన్స్‌పెక్టర్ గంగాధర్, ఉపాధి హామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన బాలుర కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

పెర్కిట్, జూలై 11: ఆర్మూర్ పట్టణంలోని చీమన్ పెల్లి గిరిజన సంక్షేమ బాలుర కళాశాలలో స్పాట్ అడ్మిషన్‌లు నిర్వహించనున్నామని ఆర్‌సీ ఓ.సంపత్‌కుమార్ ప్రిన్సిపాల్ విల్లాస్లైల్స్ తెలిపారు. ఎంపీసీ, బైపీసీలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం మాత్రమే అవకాశం ఉందని తెలిపారు. పదో తరగతిలో ఉత్తీర్ణులైన బాలురు బోనఫైడ్, ఒరిజినల్ టీసీ, ఆధార్‌కార్డు, కుల, ఆదాయ సర్టిఫికెట్‌లతో ఉదయం 10గంటలకు కళాశాలలో హాజరుకావాలని తెలిపారు.



నియామకపత్రం అందజేస్తున్న దృశ్యం

బ్రాహ్మణ సేవా సంఘం కార్యవర్గం ఎన్నిక

బోధన్‌రూరల్, జూలై 11: బోధన్ పట్టణంలోని బ్రాహ్మణగల్లీలో గురువారం బ్రాహ్మణ సేవ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా ప్రవీణ్ దేశ్‌ముఖ్, ఉపాధ్యక్షులుగా రణధీర్ శర్మ, ప్రవీణ్ మహరాజ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర బ్రాహ్మణ సేవ సంఘం ఎన్నికల అధికారి ప్రభాకర్ శర్మ వైద్య, రవీందర్ శర్మలు తెలిపారు. ఈసందర్భంగా వారికి నియామకపత్రాలను అందజేశారు. బ్రాహ్మణ సేవ సంఘం అభివృద్ధికి కమిటీ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు వినోద్ పట్వారీ, మాజీ ఉపాధ్యక్షులు ఉమానందు వైద్య, రాజు కులకర్ణి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నవీపేట, జూలై 11: మండలంలోని జన్నేపల్లి 33/11 సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని నవీపేట ట్రాన్స్‌కో ఏడీఈ సుహాసిని తెలిపారు. జన్నేపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని జన్నేపల్లి, సిరన్‌పల్లి, నాడాపూర్, గాంధీనగర్‌లలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని తెలిపారు.



డీఎస్ చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న మున్నూరుకాపు మండల సభ్యులు

మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో డి.శ్రీనివాస్‌కు శ్రద్ధాంజలి

ఇందల్వాయి, జూలై 11: ఇందల్వాయి మండల మున్నూరుకాపు సంఘం సభ్యులు మండల అధ్యక్షుడు బుట్ట గంగాధర్ ఆధ్వర్యంలో డి.శ్రీనివాస్ చిత్రపటానికి నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా బుట్ట గంగాధర్ మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లా నుంచి కాంగ్రెస్ పార్టీలో అత్యున్నత స్థాయికి ఎదిగిన వ్యక్తి డి.శ్రీనివాస్ అని రాష్ట్ర అభివృద్ధి కోసం ఆయన ఎనలేని కృషి చేశారని అన్నారు. బీసీల ఐక్యత కోసం పోరాడిన వ్యక్తి అని కాంగ్రెస్ పార్టీలో ఎన్నో అత్యున్నత పదవులను అధిరోహించి జిల్లాకు ఖ్యాతి తీసుకొచ్చారని అన్నారు. ఆయన మరణం కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘ సభ్యులు ఎల్ఐసి గంగాధర్, పులి సాగర్, గడ్కోల్ శ్రీనివాస్, శ్రావణ్, విఠల్, గట్టు కదారి, తదితరులు ఉన్నారు.

ఉచిత విద్యుత్ మీటరు నెంబర్ మార్పునకు అవకాశం

నవీపేట, జూలై 11: గృహజ్యోతిలో భాగంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పొందే వినియోగదారులకు మీటరు నెంబర్ మార్పునకు అవకాశం కల్పించబడిందని ట్రాన్స్‌కో ఏడీఈ సుహాసిని తెలిపారు. ప్రజాపాలనలో భాగంగా ఉచిత విద్యుత్ కోసం దరఖాస్తు చేసుకున్న సమయంలో ఇచ్చిన మీటరు నెంబర్‌కు బదులుగా మరో యూనిక్ సర్వీస్ నెంబర్ మార్పు కోరే వినియోగదారులు మండల పరిషత్ కార్యాలయంలోని కౌంటర్‌లో మార్చుకోవాలని ఆమె సూచించారు. అద్దె గృహాలలో ఉండి ఇల్లు మార్చిన వారికి ఈ అవకాశం పొందే వీలుంటుందని ఆమె వివరించారు.



పోలీసుల దాడికి నిరసనగా విధులు బహిష్కరించిన న్యాయవాదులు

న్యాయవాదుల విధుల బహిష్కరణ

నిజామాబాద్ లీగల్, జూలై 11: సిద్దిపేట జిల్లా బార్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది రవికుమార్‌పై స్థానిక ఏఎస్సై ఉమారెడ్డి దాడి చేయడాన్ని నిరసిస్తూ జిల్లా న్యాయవాదులు విధులు బహిష్కరించారు. రాష్ట్ర ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ పిలుపు మేరకు గురువారం జిల్లా న్యాయవాదులు అత్యవసర సమావేశం నిర్వహించి విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ మోహన్‌గౌడ్ మాట్లాడుతూ.. న్యాయవాదిపై దాడి శోచనీయమని దీనిని తీవ్రంగా ఖండించాలని డిమాండ్ చేశారు. కక్షిదారుడి బెయిల్ జమానత్ పేపర్లను సమర్పించడానికి వెళ్లిన సమయంలో వాదన పడి దాడి చేయడం సరికాదని ఏఎస్సైపై తక్షణమే చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులకు కూడా రక్షణ చట్టం అవసరమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు రాజేందర్‌రెడ్డి, జిల్లా బార్ అసోసియేషన్ కార్యదర్శి వసంత్‌రావ్, ఉపాధ్యక్షుడు పి. రాజు, కోశాధికారి దీపక్, న్యాయవాదులు గొరైపాటి మాధవరావ్, మధుసూదన్‌రావు, పర్చూరీ శ్రీధర్ పాల్గొన్నారు.

'రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి'

నిజామాబాద్ అర్బన్, జూలై 11: రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ నాయకులు గురువారం అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ పొందుపర్చిన విధంగా ప్రతినెలా 1వ తేదీన పెన్షనర్లకు పెన్షన్లు చెల్లించడం గొప్ప విషయమని ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. నగదు రహిత వైద్య సేవలు అమలు చేయాలని ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ద్వారా పెన్షనర్ల మూల పెన్షన్ నుంచి ఒక శాతం మినహాయించి వెంటనే నగదు రహిత వైద్య చికిత్స అందేలా చూడాలని కోరారు. డియరెనెస్ రిలీఫ్ నాలుగు వాయిదాలు విడుదల చేయాలని ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. అదనపు కలెక్టర్‌ను కలిసిన వారిలో బోజాగౌడ్, పండరినాథ్, శ్రీనివాస్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, రాజేశ్వర్‌రెడ్డి, జగత్‌రెడ్డి, దయాకర్‌రావు తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ధర్పల్లి, జూలై 11: మండల కేంద్రం నుంచి అక్రమంగా తరలిస్తున్న మూడున్నర క్వింటాల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై విక్రమ్ గురువారం తెలిపారు. అర్ధరాత్రి మోటారు సైకిళ్లపై పిడిఎస్ బియ్యంను తరలిస్తున్న షేక్ మోసీన్, షేక్ ఇబ్రహీంతో పాటు ఎన్టీఆర్ కాలనీకి చెందిన మాలావత్ నాందేవ్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులకు అప్పచెప్పినట్లు ఆయన చెప్పారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఆలయ కమిటీ చైర్మన్‌గా బాల గంగాధర్

ధర్పల్లి, జూలై 11: మండల కేంద్రంలోగల శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా జనగామ బాల గంగాధర్ గురువారం ఎన్నికయ్యారు. అధ్యక్ష పదవి కోసం పోటీ జరుగగా పోటీలో బాల గంగాధర్ విజయం సాధించారు. ఉపాధ్యక్షులుగా చెలిమెల రాములు, కోశాధికారిగా పాల్దె గంగాదాస్, కార్యదర్శిగా దాసరి గంగరాజం, ఉపకార్యదర్శిగా శ్రావణ్‌కుమార్‌లు ఎన్నికయ్యారు. ఆలయ అభివృద్ధి కోసం తమవంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా ఎన్నికైన కార్యవర్గం పేర్కొంది.

నేడు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

ఖిల్లా, జూలై, 11 :నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో శుక్రవారం ట్రాఫిక్ ఆంక్షలను విధిస్తున్నట్లు పోలీసు కమీషనర్ కల్మేశ్వర్‌శింగేనేవార్ తెలిపారు. నగరంలో ఇస్కాన్ అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంస్థ (ఇస్కాన్)ఆధ్వర్యంలో జగన్నాథ రథ యాత్ర నిర్వహిస్తున్నందున ట్రాఫిక్ మళ్లింపు జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్ర 7గంటల వరకు కంఠేశ్వర్ దేవాలయం నుంచి ఎన్టీఆర్ చౌరస్తా, రైల్వేస్టేషన్, తిలక్‌గార్డెన్, ప్రభుత్వ ఆస్పత్రి, సాయరెడ్డి పెట్రోల్ బంక్, మహాత్మగాంధీచౌక్, నెహ్రూపార్క్, పెద్దబజార్, ఆర్ఆర్ చౌరస్తా, పులాంగ్ చౌరస్తా, వినాయక్‌నగర్‌లోని విజయలక్ష్మి గార్డెన్ ఫంక్షన్‌హాల్ వరకు యాత్ర ముగిసే వరకు ట్రాఫిక్ ఇబ్బందులు ఉంటాయన్నారు. ప్రయాణాలను ఇతర ప్రాంతాల నుంచి ఏర్పాటు చేసుకోవాలన్నారు.

బ్యాక్‌లాగ్ పరీక్షలు పదోరోజు ప్రశాంతం

డిచ్‌పల్లి, జూలై 11: తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ బ్యాక్‌లాగ్ వన్‌టైం పరీక్షలు గురువారం పదోరోజు ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంట చంద్రశేఖర్ తెలిపారు. అనుబంధ కళాశాల పరిధిలో వన్‌టైం చాన్స్ సీబీసీఎస్ డిగ్రీ 5,6వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు 248విద్యార్థులకు గాను 239 మంది హాజరయ్యారని, 9 మంది గైర్హాజరయ్యారని చంద్రశేఖర్ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 149మంది విద్యార్థులకు గాను 142 పరీక్షకు హాజరయ్యారని, 7గురు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు.





చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.120	రూ.230	రూ. 250
వెన్‌కాబ్(కిలో)	: రూ.125	రూ.235	రూ. 255



బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.73,200	రూ.67,500	రూ.935

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : కల్కి (3డి తెలుగు) (11.00, 6.30)
: కల్కి (హిందీ) (2.45, 10.15)
స్క్రీన్-2 : భారతీయుడు-2 (11.15, 3.00, 6.45, 10.30)
స్క్రీన్-3 : కిల్ (హిందీ) (12.15, 2.45, 9.00)
: భారతీయుడు-2 (5.15)
స్క్రీన్-4 : సర్ఫిరా (హిందీ) (12.20, 3.40, 7.00, 10.20)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : భారతీయుడు-2 (9.00, 12.30, 4.00, 7.25, 10.50)
స్క్రీన్-2 : కల్కి (తెలుగు) (12.30)
స్క్రీన్-3 : కల్కి (తెలుగు) (10.30, 3.20, 7.00, 10.40)

దేవి : భారతీయుడు-2 (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : భారతీయుడు-2 (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కల్కి (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్



